# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 362 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 11 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608


### అన్నా.. మీతో కలిసి పనిచేయమని
# దేవుడే పంపించాడు
## కేసీఆర్‌తో భేటీలో జీవన్‌రెడ్డి

**ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన జీవన్‌రెడ్డి**

**కేసీఆర్ కలిసినప్పుడు భావోద్వేగానికి గురైన జీవన్‌రెడ్డి**

**ఇన్నాళ్లకైనా కేసీఆర్ కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎర్రవల్లి నివాసం వేదికగా ఈ భేటీ జరిగింది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీని వీడిన ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లుగా నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటన తర్వాత తొలిసారిగా కేసీఆర్‌తో భేటీ అయ్యారు. సమావేశంలో జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భేటీ సందర్భంగా భవిష్యత్ కార్యచరణతో పాటు పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చాయి.

'తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు అన్నా. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' – జీవన్ రెడ్డి, సీనియర్ నేత

జీవన్‌రెడ్డిని ఆహ్వానించిన కేసీఆర్ : కాగా జీవన్ రెడ్డిని అనునయిస్తూ, అప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేసీఆర్, శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. భేటీ సందర్భంగా కేసీఆర్, జీవన్‌రెడ్డి మధ్య పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చినట్లుగా సమాచారం. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ ..మిగతా 2లో



### మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో
# ఎందుకు లింకు

**సీడబ్ల్యూసీ సమావేశంలో**

**రాహుల్, ఖర్గే, వేణుగోపాల్, రేవంత్, ప్రియాంక**

**లోక్‌సభ సీట్ల పెంపుతో రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయి**

**ఈ బిల్లును అడ్డుకోవాల్సి వస్తే నేను కాదు ప్రజలే తిరగబడతారు**

**ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిట్‌చాట్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

లోక్‌సభ నియోజకవర్గాల పెంపు (పునర్విభజన)తో రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయని, ఫలితంగా ప్రజా ఉద్యమాలు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు చట్టాల్లాగే డీలిమిటేషన్ బిల్లును కూడా వెనక్కి తీసుకోకతప్పదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర ద్రోహం చేస్తోందని అన్నారు. ఈ రాష్ట్రాలను రాజకీయంగా అణగదొక్కే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఇది పార్టీల సమస్య కాదని, ప్రాంతాల సమస్య అని చెప్పారు. 'ఇప్పటికే మేము తీవ్రమైన బాధతో ఉన్నాం.. గాయపడి ఉన్నాం.. మమ్మల్ని ఇంకా రెచ్చగొట్టొద్దు' అని హెచ్చరించారు. శుక్రవారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరైన అనంతరం.. రాత్రి తన అధికారిక నివాసంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'నియోజకవర్గాలను ..మిగతా 2లో

### హరివంశ్ నారాయణ సింగ్‌కు
# మరో ఛాన్స్

**రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం**

**మరోమారు డిప్యూటీ చైర్మన్ అయ్యే అవకాశం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ..మిగతా 2లో

### డీజీపీ ముందు డిప్యూటీ కమాండర్ కేశాలు సహా
# 42 మంది లొంగుబాటు



**పోలీసుల ఎదుట లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు**

**లొంగిపోయిన వారిలో 11 మంది పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు**

**సోది కేశాలు లొంగుబాటును కీలకంగా భావిస్తున్న పోలీసులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. డీజీపీ ఎదుట 42 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 11 మంది పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు ఉన్నారు. బెటాలియన్ కమాండర్ సోది కేశాలు లొంగుబాటును పోలీసులు కీలకంగా భావిస్తున్నారు. లొంగిపోయిన మావోయిస్టులు ..మిగతా 2లో

### హైదరాబాద్-విజయవాడ మధ్య
# విమాన సర్వీసు

**ఫ్లై 91 విమాన సర్వీసును ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు**

**విజయవాడ,ఏప్రిల్10 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ – విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభించింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడంతో పాటు, సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఫ్లై 91 సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. కేంద్ర ..మిగతా 2లో






### హెచ్ఐవీ రక్తం ఎక్కించిన
# ఘటనలో విషాదం

**బాధిత యువతి ఆత్మహత్య**

**మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహానికి నిరాకరించిన యువతి**

**బలవంతంగా హెచ్ఐవీ రక్తాన్ని ఎక్కించి పరారైన నిందితుడు - నేడు ఆత్మహత్య చేసుకున్న యువతి**

**హైదరాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

తనతో వివాహానికి నిరాకరించిందని ఓ యువతికి హెచ్ఐవీ రక్తాన్ని ఎక్కించిన ఘటనలో విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో యువతి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల పెళ్లికి నిరాకరించింది. దీంతో యువతికి హెచ్ఐవీ రక్తాన్ని యువకుడు ఎక్కించాడు. వివరాల్లోకి వెళితే, ..మిగతా 2లో

### అమెరికాతో
# ఆటలు ఆడవద్దు

**ఇరాన్‌కు జేడీ వాన్స్ హెచ్చరిక**

**ఇరాన్‌తో ఉద్రిక్తతలు - శాంతి చర్చల కోసం**

**ఇస్లామాబాద్ బయలుదేరిన అమెరికా ఉపాధ్యక్షుడు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్10 (ప్రభాత ఉదయం)**

ఇరాన్ ప్రభుత్వం తమతో ఆటలు ఆడకూడదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరించారు. టెహ్రాన్ చిత్తశుద్ధితో, నిజాయితీగా చర్చలకు ముందుకు వస్తే, తాము కూడా కచ్చితంగా స్నేహ హస్తం అందిస్తామన్నారు. అలాకాకుండా తమతో ఇరాన్ ఆటలు ఆడాలని చూస్తే మాత్రం పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరించారు. తమ చర్చల బృందం నుంచి వారికి ఏమాత్రం ..మిగతా 2లో



### బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో
# ధ్వజమెత్తిన పొంగులేటి

**తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య**



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ ..మిగతా 2లో

# అన్నా.. మీతో కలిసి పనిచేయమని దేవుడే పంపించాడు



మొదటి పేజీ తరువాయి...

జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

జగిత్యాల సభలో బీఆర్ఎస్‌లో చేరనున్న జీవన్ రెడ్డి : కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరికకు మూహుర్తం ఖరారైంది. ఈ నెల 20వ తేదీ లోపు జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభా వేదికగా ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. ఈ మేరకు కేసీఆర్‌తో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి కేటీఆర్‌తో పాటు, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు స్వాగతం పలికారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ ప్లీనరీ కంటే ముందే కేసీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి పార్టీలో చేరుతారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు.

"జగిత్యాలలో 10రోజుల్లో భారీ బహిరంగ సభ ఉంటుంది. సభలో కేసీఆర్ సమక్షంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతారు. కేసీఆర్‌తో మమేకమై జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తారు. బీఆర్ఎస్ ప్లీనరీ కంటే ముందే జగిత్యాల సభ ఉంటుంది"–కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నేత

కాంగ్రెస్ తెలంగాణపై పట్టుకోల్పోయింది : మాజీ సీఎం కేసీఆర్‌తో జీవన్‌రెడ్డి ఐదు గంటల పాటు సమావేశమయ్యారు. అనంతరం జీవన్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పట్టుకోల్పోయిందని విమర్శించారు. ఒకప్పుడు పీసీసీ చెప్పినట్లుగా సీఎం నడుచుకునేవారని కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి చెబితే పీసీసీ అమలు చేస్తోందన్నారు. త్వరలోనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ పెట్టి కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరతానని జీవన్‌రెడ్డి తెలిపారు. పీసీసీ తప్పు చేసి ఆ నింద ఏఐసీసీపై వేస్తోందన్నారు.

తనకు 14 సార్లు బీ-ఫామ్ ఇచ్చారంటే అది తన సమర్థతతోని మాత్రమేనని జీవన్‌రెడ్డి అన్నారు. కంటెంట్ ఉన్న నాయకుడిని అయినందువల్లే కాంగ్రెస్ తనకు టికెట్ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమనంలో పయనిస్తుందని జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలి అని ప్రజల్లో చర్చ మొదలైందన్నారు. మిగిలిన రెండున్నరేళ్లు అయినా ప్రభుత్వం బాగా పనిచేయాలని కోరుకుంటున్నట్లుగా వెల్లడించారు.

## డీజీపీ ముందు డిప్యూటీ కమాండర్ కేశాలు సహా

# 42 మంది లొంగుబాటు

మొదటి పేజీ తరువాయి...

ఆయుధాలను పోలీసులకు సరెండర్ చేశారు. వీటిలో ఏకే47 సహా పలు అధునాతన ఆయుధాలున్నట్లుగా సమాచారం. లొంగిపోయిన వారిలో ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన మావోయిస్టులు ఉన్నట్లుగా తెలిసింది. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోలు తెలంగాణ పోలీసులను ఆశ్రయించి లొంగిపోయారు.

మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ : తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారని వెల్లడించారు. అధికశాతం మంది ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందినవారున్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీలను అందిస్తామని శివధర్ రెడ్డి పేర్కొన్నారు. మొత్తం రూ.1.93 కోట్లను అందజేస్తున్నామని వివరించారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులను అందజేస్తామన్నారు. గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయారని శివధర్ రెడ్డి తెలిపారు.

మిగిలిన వారు కూడా లొంగిపోవాలి : తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు మావోయిస్టు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారని ప్రస్తుతం ఆ సంఖ్య రెండుకు పడిపోయిందని శివధర్ రెడ్డి తెలిపారు. స్టేట్‌కమిటీ మెంబర్లు 24 ఉంటే ప్రస్తుతం ఆసంఖ్య రెండుకు పడిపోయిందన్నారు. ఆర్‌సీఎంలు ఇద్దరు ఉండే ఒకరు అట్లానే ఉన్నారని వివరించారు. డివిజన్ కమిటీ సెక్రటరీ మెంబర్ స్థాయిలో ఉన్నవారు 36 మంది ఉంటే ఇవాళ ఆ సంఖ్య ఒకటికి వచ్చిందని వివరించారు. దళ సభ్యులు 30 మంది ఉండేవారని ప్రస్తుతం ఎవరూ లేరని వివరించారు.

"లొంగిపోయిన 42 మందిలో ఒక్కరు మాత్రమే తెలంగాణ వ్యక్తి. మిగిలిన వారు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సంబంధించిన వారు. తెలంగాణ స్టేట్ కమిటీకి సంబంధించి 11 మంది ఈ రోజు సరెండర్ అయ్యారు. వాళ్లు చెల్లాచెదురై ఉంటే తీసుకొచ్చాం. లొంగిపోయిన వారిలో కొంజం విడుమాల్ ఎలియాస్ మహేందర్ మాత్రమే తెలంగాణకు చెందిన వారు. 2023 డిసెంబర్‌లో 125 మంది ఉంటే ఇవాళ్టికి ఐదుగురు మిగిలారు. గణపతి సహా రాష్ట్రానికి చెందిన మరో ఐదుగురు అజ్ఞాతంలో ఉన్నారు. వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలని ఆహ్వానిస్తున్నాం"– శివధర్‌రెడ్డి, తెలంగాణ డీజీపీ

లొంగిపోయిన వారికి రివార్డులను అందజేత : తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే పునరావాస ప్యాకేజీ కింద రాష్ట్ర కమిటీ సభ్యులకు రూ.20 లక్షలు, డివిజనల్ కమిటీ కార్యదర్శికి రూ.8 లక్షలు, మెంబర్‌కు రూ.5లక్షలు ఏరియా కమిటీ మెంబర్‌కు రూ.4లక్షల ఇస్తున్నామన్నారు. కేంద్రహోంశాఖ మార్గదర్శకాల ప్రకారం జనజీవన స్రవంతిలోకి ఆయుధాలతో లొంగిపోయిన ఎల్‌ఎంజీకి రూ.5 లక్షలు, ఏకే–47 తీసుకువస్తే రూ.4లక్షలు, ఎస్ఎల్‌ఆర్‌కు రూ.2లక్షలు రివార్డుల రూపంలో మొత్తం 42 మందికి రూ.1.93 కోట్లను అందిస్తామన్నారు.

మావోయిస్టు ఉద్యమం ముగిసినట్టేనా : తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం పూర్తిగా తగ్గిందని పోలీసులు చెబుతున్నారు. ఆపరేషన్ కగార్ ప్రభావంతో అనేక మంది ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది ఆ పార్టీ నేతలు అడవి వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. దీంతో మావోయిస్టు పార్టీ బలహీనపడింది. ఆ పార్టీ అగ్రనేతలు ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిపై ఉన్న రివార్డులను ప్రభుత్వం అందజేసింది.

# హెచ్‌ఐవీ రక్తం ఎక్కించిన ఘటనలో విషాదం

మొదటి పేజీ తరువాయి...

అసలేమైందంటే : పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జనగామ జిల్లాకు చెందిన ఓ యువకుడి (24) కుటుంబం గత పాతికేళ్లగా హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. అతడు ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అయితే అతడి తల్లిదండ్రులిద్దరికీ హెచ్‌ఐవీ పాజిటివ్ ఉంది. కొన్నేళ్ల క్రితమే తండ్రి చనిపోయాడు. కాగా అతడు తన ఇంటికి దగ్గరిలో నివాసం ఉంటున్న తన మరదలి(20)ని ఇష్టపడుతున్నాడు. ఆమె కూడా ఇతడి ప్రేమను అంగీకరించింది. పెద్దలు కూడా దీనిని సమ్మతించడంతో వారి ప్రేమ కొంత కాలంగా కొనసాగింది. ఇటీవల వారికి వివాహం జరిపేందుకు ఇంట్లో పెద్దలు సైతం సిద్ధమయ్యారు. అయితే యువతి తండ్రి ఆ యువకుడికి ఇటీవల రక్తపరీక్షలు నిర్వహించారు. కాగా అతడికి హెచ్‌ఐవీ వ్యాధి ఉన్నట్లుగా వైద్యులు నిర్ధారించారు. దీంతో వారి వివాహం రద్దు చేసుకున్నారు.

ఆమెకూ హెచ్‌ఐవీ ఉంటే తనతోనే వివాహం చేస్తారని : చిన్ననాటి నుంచి ప్రేమించిన అమ్మాయి ఒక్కసారిగా దూరం పెట్టడంతో అతడు భరించలేకపోయాడు. ఎలా అయినా ఆమెను సొంతం చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడు. దీనిలో భాగంగానే అతడు ఓ పన్నాగం పన్నాడు. ఆమెకు హెచ్‌ఐవీ పాజిటివ్ ఉంటే మరొకరికి ఇచ్చి వివాహం చేయలేరని భావించాడు. తాను ఒంటరిగా మిగిలిపోవడంతో తనతోనే వివాహం చేస్తారని ఊహల్లో తేలాడు. దీనిని ఉద్దేశించి పథకాన్ని రచించాడు. హెచ్‌ఐవీ రక్తాన్ని ఎక్కిస్తే ఆమె కూడా వ్యాధిగ్రస్తురాలు అవుతుందని భావించాడు.

బలవంతంగా రక్తం ఎక్కించి పరార్ : తన పథకంలో భాగంగా గత నెల 11న సిరంజీని కొనుగోలు చేశాడు. అందులో తన రక్తాన్ని ఎక్కించాడు. సాయంత్రం సమయంలో యువతి ఇంటికి వెళ్లాడు. మరోసారి పెళ్లి ప్రతిపాదన తెచ్చాడు. అయితే వివాహానికి ఆమె నిరాకరించడంతో వాగ్వాదానికి దిగాడు. చివరిగా తనతో తీసుకువచ్చిన సిరంజీలోని రక్తాన్ని ఆమెకు బలవంతంగా ఎక్కించాడు. ఆపై పరారయ్యాడు. దీంతో బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కాగా నేడు యువతి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో యువతి ఇంట్లో విషాదఛాయలు అలముకున్నాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని యువతి కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు : జీవితమన్నాక ఏదో ఓ సందర్భంలో సమస్యలు రావడం సహజమని నిపుణులు అంటున్నారు. సరైన రీతిలో ఆలోచిస్తే సమస్యలకు పరిష్కారమార్గాలు అనేకం లభిస్తాయని చెబుతున్నారు. మీకు ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు వచ్చినా, తీవ్ర ఒత్తిడిలో ఉన్నా, మీ సమస్యను ఎవరితోనైనా పంచుకోవాలని అనుకుంటున్నా, మీకు సహకరించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్లు సిద్ధంగా ఉన్నాయి. మన తోటి వారు కష్టాల్లో ఉండి ఆత్మహత్యలకు పాల్పడేందుకు సిద్ధపడుతున్నా వీరిని సంప్రదించవచ్చు. ఇలాంటి సమస్యలనుంచి ధైర్యం చెప్పేందుకు స్నేహ ఫౌండేషన్ – 04424640050 (24ఇ7 అందుబాటులో ఉంటుంది) లేదా టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హెల్ప్‌లైన్ – 9152987821కి సంప్రదించవచ్చు. వీరు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 నుండి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటారు. వారిని సంప్రదించి మీ సమస్యలను వివరించవచ్చు. తద్వారా తగిన పరిష్కారమార్గాలను పొందవచ్చు.

## హైదరాబాద్-విజయవాడ మధ్య

# విమాన సర్వీసు

మొదటి పేజీ తరువాయి...

విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన సర్వీసును శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ఈ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్–2, టైర్–3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ – హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి

మొదటి పేజీ తరువాయి...

నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు.



## మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో

# ఎందుకు లింకు

మొదటి పేజీ తరువాయి...

ఏ ప్రాతిపదికన, ఎలా పెంచాలి అనే దానిపై కనీస చర్చ లేకుండా ఎందుకింత అర్జెంటుగా? దేశంలో 50 శాతం నియోజకవర్గాల పెంపు జరిగితే ఉత్తరాదికే పూర్తి అడ్వాంటేజ్‌గా మారుతుంది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే దుస్థితి వస్తుంది. చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా ప్రాముఖ్యత కోల్పోతాయి. చిన్న రాష్ట్రాలు మరింత చిన్నగా, పెద్ద రాష్ట్రాలు మరీ పెద్దగా మారిపోతాయి. ఆర్థిక ప్రాతిపదికన, మెరిట్ డిజబిలిటీ విధానంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పెంపు ఉండాలి.

చిన్న రాష్ట్రాలు, పెద్ద రాష్ట్రాల మధ్య ఇప్పుడున్న గ్యాప్ అలాగే కొనసాగాలి. ప్రస్తుతం కేరళ, యూపీ మధ్య 60 సీట్ల తేడా ఉంది. పునర్విభజన జరిగితే అది ఏకంగా 99కి పెరుగుతుంది. ఇది ముమ్మాటికీ చిన్న రాష్ట్రాలకు ఉరితాడు లాంటిదే. భవిష్యత్తులో ఉత్తరాది సీట్లు పెరిగితే.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చోటు దక్కించుకున్న బండి సంజయ్, కిషన్‌రెడ్డి లాంటి దక్షిణాది బీజేపీ నేతలకు కనీసం చప్రాసీ పదవి కూడా దొరకదు..' అని సీఎం అన్నారు.

'నియోజకవర్గాల పెంపు అనేది అందమైన ముసుగులో చేస్తున్న మోసం. బీజేపీ పెడుతున్న ఈ మెలికల్లో వారి రాజకీయ స్వార్థం దాగుంది. గతంలో ఇలాగే హడావుడి చేసి రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చారు. రైతుల ఆందోళనతో మళ్లీ వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లుపై సౌత్‌లో రియాక్షన్ వస్తే, బీజేపీ పాలిత చిన్న రాష్ట్రాలు సహా.. ఇతర చిన్న రాష్ట్రాలు వ్యతిరేకిస్తే కేంద్రం ఏం చేస్తుంది? ఈ బిల్లును అడ్డుకోవాల్సి వస్తే నేను కాదు ప్రజలే తిరగబడతారు.

మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లను దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ అమలు చేశారు. సోనియాగాంధీ గతంలోనే మహిళా రిజర్వే షన్ బిల్లును పెట్టారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల కోసం సీట్లు పెంచాల్సిన అవసరం ఏముంది? ఇప్పుడున్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 181 సీట్లను మహిళలకు కేటాయించి రిజర్వేషన్లు అమలు చేయొచ్చు కదా? కేంద్రం లీకులు ఇస్తున్న ఇతర సవరణలపై ఇండియా కూటమితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయించాం..' అని రేవంత్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు అవమానం జరిగిందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'గతంలో బీఆర్ఎస్‌లో సీనియర్లుగా ఉన్న ఆలె నరేంద్ర, దేశిని చిన్న మల్లయ్య, ఈటల రాజేందర్, విజయ–శాంతి లాంటి ఎంతోమందికి ఏం జరిగిందో, వారిని ఎలా గెంటేశారో అందరికీ తెలుసు..' అని వ్యాఖ్యానించారు.

## హరివంశ్ నారాయణ సింగ్‌కు

# మరో ఛాన్స్

మొదటి పేజీ తరువాయి...

ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరఫున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి. హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించిన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేటెడ్ సభ్యుడిగా ఉంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ ఛైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమెరికాతో ఆటలు ఆడవద్దు

మొదటి పేజీ తరువాయి...


సానుకూల స్పందన లభించదని తేల్చి చెప్పారు. ఇరాన్ ఇప్పటి వరకు తమ ప్రతినిధి బృందం వివరాలను ఇంకా గోప్యంగా ఉంచిన నేపథ్యంలో, శుక్రవారం ఇస్లామాబాద్ బయలుదేరుతూ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇస్లామాబాద్ వేదికగా జరగనున్న చర్చలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఆరు వారాల క్రితం మొదలైన ఈ యుద్ధానికి పరిష్కారం కనుగొనాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తనకు అత్యంత సన్నిహితుడైన జేడీ వాన్స్‌కు బాధ్యతలు అప్పగించారు. టెహ్రాన్ శాంతి చర్చలకు అంగీకరించకపోతే, 'ఇరాన్ నాగరికత'ను తుడిచిపెట్టాస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, పరిస్థితి చక్కదిద్దే పనిని జేడీ వాన్స్ స్వీకరించారు. వాస్తవానికి ఇరాన్‌తో అమెరికా ఘర్షణ విషయంలో వాన్స్ మొదటి నుంచి అంత ఆసక్తిగా లేరు. కానీ ఇప్పుడు ఆయన ఇరుదేశాల మధ్య శాంతి కోసం రంగంలోకి దిగారు. విదేశీ సైనిక జోక్యాలను, ముగింపు లేని యుద్ధాలను వ్యతిరేకించే వాన్స్, పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ఇరాన్‌తో చర్చలు జరపడానికి శుక్రవారం తన బృందంతో కలిసి బయలుదేరారు.

**ఇరాన్ ప్రతినిధి బృందం వస్తుందా?**

శాంతి చర్చల కోసం 10 మంది సభ్యులతో కూడిన ఇరాన్ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌కు వస్తుందని పాకిస్థాన్‌లోని టెహ్రాన్ రాయబారి రెజా అమీర్ ఎక్స్ వేదికగా తెలియజేశారు. అయితే లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరపడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. దాడులను ఖండిస్తూ కొద్దిసేపటికే ఇరాన్ రాయబారి తన ప్రకటనను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించారు. మరోవైపు శాంతి చర్చలు జరగనున్న వేళ పశ్చిమాసియాలో మరోసారి అలజడి రేగుతోంది.

# మధుబన్ కాలనీలో ట్రాఫిక్ నియంత్రణకు వన్ వే ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మధువన్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు


ట్రాఫిక్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు


కాలనీలో ట్రాఫిక్ సమస్యను పోలీసులకు వివరిస్తున్న ప్రతినిధులు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**

మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ , ట్రాఫిక్ విభాగం అధికారులను కలిసి ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణారెడ్డి, ట్రాఫిక్ పోలీస్ అధికారులను కలిసిరోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి , ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, వాహనాలను ఏకపక్ష మార్గం (వన్ వే) ద్వారా మళ్లించాలని కోరుతూ కాలనీ ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీరామ్ కాలనీ నుండి వచ్చే వాహనాలను మధుబన్ బస్ స్టాప్ ఎక్స్ రోడ్డు వద్ద కుడి వైపునకు మళ్లించి, అక్కడి నుండి రామకృష్ణ విద్యాలయం రోడ్డు మీదుగా మధుబన్ రోడ్డు ఎగ్జిట్ వైపు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రతిపాదనలో కోరారు.టీఎస్ఆర్టీసీ , ట్రాఫిక్ విభాగం అధికారులు తక్షణమే స్పందించి, కాలనీని సందర్శించారు.కాలనీలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచడానికి భద్రతను పెంచడానికి, వాహనాలను ఏకపక్ష మార్గం (వన్ వే) ద్వారా మళ్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.జి. విజయ్, జనరల్ సెక్రటరీ సుర్వే ఉత్తమ్, వైస్ ప్రెసిడెంట్ కిషోర్ , జాయింట్ సెక్రటరీ ఆకుల సతీష్ లు ఉన్నారు.



ఉద్యోగ సంఘం నేత మజ్జిగ శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించి జన్మ దిన శుభాకాంక్షలు తెలుపుతున్న మిత్రులు, సహచర ఉద్యోగులు


# ఉద్యోగ సంఘాల నాయకులు మజ్జిగ శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించిన నాయకులు

**బుద్వేల్, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ తాలుకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ గా, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా బవానీకాలనీ కి చెందిన మజ్జిగ శ్రీనివాస్ యాదవ్ చేస్తున్న సేవలు అభినం దనీయమని బీజేపీ గోల్కొండ గోషామహల్ జిల్లా ఇంచార్జి వై శ్రీధర్ అన్నారు. ఎం శ్రీనివాస్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఆయన చిన్ననాటి మిత్కులు, కలసి చదువుకున్న బీజేపీ గోల్కొండ గోషామహల్ జిల్లా ఇంచార్జి వై.శ్రీధర్ తో పాటు వర్శిటీ ఉద్యోగ సంఘాల నాయకులు ఎస్ జయరాం, షేక్ నజీర్, దశరథ, రవీందర్రెడ్డి, బీజేపీ నాయకులు డి యాదగిరి, విశ్రాంత ఎస్ఐ భీమయ్య, తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

**బుద్వేల్, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**



ఈ నెల 11న ఉదయం 9 గంటలకు రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఆవరణలో జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు పూలే జయంతి ఉత్సవాల వ్యవస్థాపక కమిటీ అధ్యక్షులు కె క్రిష్ణమాచారి ఓ ప్రకటనలో తెలిపారు. . ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ హాజరు కానున్నారు. అందుకోసం ఉత్సవాల కమిటీ అధ్యక్షులు బండారి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మహారాష్ట్ర లోని పుణే లో 1827 ఏప్రిల్ 11న పూలే జన్మించారని గుర్తు చేశారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన తో పాటు మహిళోద్ధరణకు పూలే ఎంతగానో కృషి చేశారని బండారి శంకర్ తెలిపారు. అణగారిని కులాల ప్రజలకు సమాన హక్కులను పొందుకోవడానికి స్వాతంత్ర్యానికి పూర్వమే ఆయన పోరాడిన వ్యక్తి అని గుర్తు చేశారు. అందుకోసం సత్య శోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పూలే జయంతి ఉత్సవాలను జయప్రదం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు కలసి రావాలన్నారు.


సాక్షి దినపత్రిక రిపోర్టర్ గద్దె యాదగిరి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానిస్తున్న సహచర పాత్రికేయులు


సాక్షి దినపత్రిక రిపోర్టర్ గద్దె యాదగిరి చేత కేక్ కట్ చేయించిన మార్నింగ్ వాకింగ్ ఫ్రెండ్స్

# ఘనంగా సాక్షి దినపత్రిక రిపోర్టర్ గద్దె యాదగిరి జన్మదిన వేడుకలు

**బుద్వేల్, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం) :**

సాక్షి దినపత్రిక రిపోర్టర్ గద్దె యాదగిరి జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి దుర్గా హిల్స్ కమ్యూనిటీ హాల్ లో ఘనంగా జరిగాయి. మార్నింగ్ వాకింగ్ ఫ్రెండ్స్, సహచర పాత్రికేయులు గద్దె యాదగిరి చేత కేక్ కట్ చేయించి సన్మానించారు. గద్దె యాదగిరి సహృదయుడని, సేవా భావం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. గద్దె యాదగిరి కి భగవంతుడు ఆయురారోగ్యాలు ఇచ్చి సుఖ సంతోషాలు ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు. జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్ మండల జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల దామోదర్ రెడ్డి, అప్పారెడ్డి గూడెం భీమయ్య, మెక్కొండ ప్రేమ్ రాజ్, బుడిగెల బాబు రావు, వర్కాల చందు, కోరని మహేష్, వాకింగ్ ఫ్రెండ్స్ మునగపాటి చంద్రయ్య, అడికె రాజు తదితరులు ఉన్నారు.


మీనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో హజ్ యాత్రికులకు ఉచిత వైద్య శిబిరం

# హజ్ యాత్రీకుల కోసం మీనా హాస్పిటల్స్‌లో ఉచిత వైద్య శిబిరం

**బుద్వేల్, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**



హజ్ యాత్రీకుల కోసం లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హజ్రత్ మౌలానా సయ్యద్ షా గులామ్ అఫ్జల్ బియబాని కుస్రో పాష అన్నారు. ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 254 వద్ద గల మీనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో ఈ వైద్య శిబిరం కొనసాగుతుండటం హజ్ యాత్రీకులకు వరం లాంటిదన్నారు. బీపీ, షుగర్, అవసరమైన వారికి ఈసీజీ, కంటి పరీక్షలు చేసి కళ్లద్దాల పంపిణీ చేస్తుండటం శుభ పరిణామమన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గం టల వరకు ఈ ఉచిత వైద్య శిభిరం కొనసాగుతుందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని హజ్ యాత్రీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మీనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ హిదాయత్ ఉల్లా ఖాన్, నాసిర్ ఖాన్, డాక్టర్ మహ్మద్ జవాద్, డాక్టర్ సోహెబా షకూర్, మహ్మద్ అఫ్జల్, అస్రా ఫాతిమా, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.




# జనగణనలో ఉపాధ్యాయులకు స్థానిక ప్రాంతాల్లోనే విధులు కేటాయించాలి

**తపస్ మదగని బాలకృష్ణ,గుంజరి బాలకృష్ణలు**

**రాజేంద్రనగర్,ఏప్రిల్10(ప్రభాత ఉదయం)**

జనగణనలో ఉపాధ్యాయులు పనిచేసే ప్రదేశంలో గాని లేదా నివాస ప్రాంతాలకు దగ్గరలో విధులు కేటాయించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ,ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణలు అన్నారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ...మొదటి విడత మే2026న జరిగే జనగణనలో భాగంగా రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఉపాధ్యాయులందరికి,వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో,వారి నివాస ప్రాంతాల్లో గాని విధులు కేటాయించాలని రాజేంద్రనగర్ సర్కిల్ కమీషనర్ మల్లయ్య,అత్తాపూర్ సర్కిల్ అసిస్టెంట్ కమీషనర్ శివకుమార్,లను కలిసి వినతి పత్రం సమర్పించారు.వారు సానుకూలంగా స్పందించి ఉపాధ్యాయులకు అనుకూలమైన ప్రాంతంలో విధులు వేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి,మధుకర్,లు పాల్గొన్నారు.


ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న బుద్వేల్ వాసి దేవాల అశోక్

# అనారోగ్య సమస్యలతో మెకానిక్‌గా పనిచేసే దేవాల అశోక్ ఆత్మహత్యాయత్నం

**బుద్వేల్, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

ఆరోగ్య సమస్యల కారణంగా బుద్వేల్ నివాసి, మెకానిక్ గా పనిచేసే దేవాల అశోక్ (56) శుక్రవారం కిస్మత్పూర్ బ్రిడ్జిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆయనను గమనించి స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులతో పాటు దేవాల అశోక్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దేవాల అశోక్ కు మెరుగైన శికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దేవాల అశోక్ ఆత్మహత్య యత్నానికి అనారోగ్య సమస్యలే కారణమని రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ కె ముత్తు యాదవ్ తెలి పారు.

## అందరు ఇంట్లో నిద్రిస్తుండగా మెట్లపై నుంచి రెండవ అంతస్థులోకి వెళ్లి

# బంగారం, నగదు, సెల్ ఫోన్‌లు దోచుకెళ్లిన దొంగ అరెస్ట్

**బుద్వేల్, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

మొదటి అంతస్థ లో అందరు నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి డూప్లెక్స్ ఇంట్లోని రెండవ అంతస్థ లోకి పక్క డోర్ లోనుంచి ప్రవేశించి బంగారం, నగదు, సెల్ఫోన్లు దొంగిలించిన దొంగను మైలార్దేవుపల్లి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తొమ్మిది తులాల నగదు, రెండు సెల్ ఫోన్లు రూ.40వేలు, 12 తులాల వెండి ని దోచుకెళ్లిన నిందితున్ని మైలార్దేవుపల్లి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. మైలార్దేవుపల్లి టీఎస్టీవోస్ కాలనీ కి చెందిన సిరంగి బుచ్చయ్య గుప్తా కుటుంబ సభ్యులు ఈ నెల 5వ తేదీన వారి ఇంట్లో పడుకున్నారు. వారు మొదటి అంతస్థులో పడుకోగా గోడదూకిన దొంగ మెట్లపైనుంచి డూప్లెక్స్ ఇం టిలోని రెండవ అంతస్తుకు వెళ్లి తలపులు తోసుకుని లోపలికి ప్రవేశించాడు. బాదితుల కథనం ప్రకారం ఇంట్లో దాచిన తొమ్మిది తులాల నగదు, రెండు సెల్ ఫోన్లు, రూ.40వేలు, 12 తులాల వెండి ని దోచుకె ళ్లాడు. మూడు గంటల పాటు ఆ ఇంట్లో ఉండి దొంగతనానికి పాల్పడి.... వచ్చిన దారి వెంటే వెళ్లిపోయాడు. ఉదయం లేచి చూసిన సిరంగి బుచ్చయ్య గుప్తా తన ఇంట్లో దొంగతనం జరిగిందని తెలుసుకుని మైలార్దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైలార్దేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ సుధాకర్, మైలార్దేవుపల్లి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ మక్సూద్ అలీ లు ధర్యాప్తు కొనసాగించి దొంగ తనానికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా చుట్టుకుంట కాలనీ కి చెందిన షేక్ షబ్బీర్ (24) ను పట్టుకున్నారు. కారు డ్రైవర్ గా పనిచేయడం, లాడ్జ్ లలో పనిచేయడం, ఫుట్ పాత్ ల పై పడుకోవడం చేస్తు నేరాలకు పాల్పడుతుంటాడని పోలీసులు గుర్తించారు. గుంటూరు నగరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని లాలాపేట్ లో కూడా గతంలో ఇతను దొంగతనానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. అతని నుంచి 3.7గ్రాముల బంగారు రంగు, 9.8గ్రాముల బంగారు రంగు, 4.8గ్రాముల వంకు, 18 గ్రాముల బంగారు పుస్తెల తాడు. ఒక ఒప్పో ఫోన్ తో పాటు ఒక ఐ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రాజేం ద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ పేరుతో విడుదల చేసిన ప్రకటన లో వెల్లడించారు. నిందితున్ని రిమాండ్ కు తరలించారు.

# మిస్టరీగా మారిన గద్వాల విద్యార్థిని అదృశ్యం

### కర్నూల్ నుంచి వచ్చిన మహిళతో... బాలిక హైదరాబాద్ కు వెళ్లినట్లు సీసి పుటేజ్ లో రికార్డు అయిన దృశ్యాలు

### ఇద్దరు కలిసి హైదరబాద్ లో ఎక్కడికి వెళ్లిండొచ్చు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**

గద్వాల జిల్లా కేంద్రంలో ఓ మైనర్ బాలిక అదృశ్యం కావడం స్థానికంగా కలకలం రేపుతోందిబి. పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని తిరిగి రాకపోవడంతో మిస్టరీ నెలకొంది. ఈ ఘటన గురువారం గద్వాల పట్టణం భవానినగర్ లో చోటు చేసుకుంది. వివరాలు... గద్వాల పట్టణంలో భవానినగర్ లో నివసిస్తున్న కృష్ణవేణి రేవులపల్లి ప్రభుత్వ స్కూల్ లో ఉపాధ్యాయురాలుగా పని చేస్తోంది. ఆమెకు రుత్విక అనే పదమూడేండ్ల కూతురు ఉంది. రుత్విక ఇండో ఇంగ్లీష్ హై స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. గురువారం ఉదయం కృష్ణవేణి తన కూతురు రుత్వికకు బై చెప్పి డ్యూటికి వెళ్లింది. ఇంట్లో వయోవృద్ధురాలు, రుత్వికమాత్రమే ఉండగా, స్కూల్ కు వెళ్తున్నట్లు చెప్పి రుత్విక వెళ్లిపోయింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కృష్ణవేణి , రుత్విక పాఠశాల నుంచి రాకపోవడంతో స్కూల్ లు వెళ్లి ఎంక్వైరీ చేసింది. స్కూల్ కు రాలేదని చెప్పడంతో తల్లి ఆందోళన చెందింది. బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో





మహిళను గుర్తు పడితే గద్వాల టౌన్ పోలీసులకు సమాచారం అందించగలరు.

బాధితురాలు గద్వాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**సీసీటీవీ పుటేజీలో కీలక ఆధారాలు**

రంగంలోకి దిగిన గద్వాల టౌన్ పోలీసులు గద్వాల పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ బస్టాండ్‌లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి:

కర్నూలు నుండి వచ్చిన ఒక గుర్తుతెలియని మహిళతో కలిసి బాలిక రెండు లగేజ్ బ్యాగ్ లతో కలిసి గద్వాల బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కినట్లు పోలీసులు గుర్తించారు.




వెంటనే అప్రమత్తమైన పోలీసులు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ లో సీసీటీవీ దృశ్యాలను కూడ పరిశీలించారు. అక్కడ సదరు మహిళతో కలిసి బాలిక బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు స్పష్టంగా రికార్డయ్యాయి.

గుర్తు తెలియని మహిళ పై అనుమానాలు??

బాలికతో పాటు ఉన్న ఆ మహిళ ఎవరు? ఆ ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఏంటి? కర్నూలు నుండి వచ్చిన మహిళ గద్వాల బాలికను ఎందుకు తీసుకెళ్లింది? అనే కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

**పోలీసుల విజ్ఞప్తి:**

ఈ ఘటనపై గద్వాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. గుర్తుతెలియని మహిళతో బాలిక వెళ్లడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలిక ఆచూకీ తెలిసిన వారు లేదా ఆ మహిళను గుర్తించిన వారు వెంటనే గద్వాల టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



# పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి

### ప్రతి గ్రామంలో ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి ,

### పెండింగ్లో ఉన్న కూలీలు వెంటనే విడుదల చేయాలి:సీఐటీయూ డిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**

పని ప్రదేశాలలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పేరు నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం ధరూరు మండలంలోని యమునోని పల్లి, పెద్దపాడు, డ్యాం, గూడెందొడ్డి, మన్నాపురం, గ్రామాలలోని ఉపాధి కూలీలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెద్దపాడు లో స్థానిక సమస్యల వల్ల ఉపాధి పనులు జరగడం లేదని దీనివల్ల కూలీలు ఉపాధి లేక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. యమునోని పల్లి గ్రామంలో సాంకేతిక సమస్యల వల్ల వరుసగా మూడు రోజులపాటు కూలీలు అడ్డమీదికి వచ్చి ఫోటో క్యాప్చరింగ్ సరిగా రాక తిరిగి వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.డ్యామ్ లో కూడా పనుల ప్రారంభం కాలేదన్నారు. గూడెం దొడ్డి గ్రామంలో సుమారు 90 మందికి పైగా కూలీలు పనిచేయడానికి వచ్చినప్పటికీ, ఫోటో క్యాప్చర్ సమస్య వల్ల పని దొరకక తిరుగు ప్రయాణం కావలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పని ప్రదేశాలలో కూలీలకు త్రాగడానికి మంచినీరు,వడదెబ్బకు గురి అయితే ప్రత్యామ్నాయంగా ఉండవలసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలీలు,వృద్ధులు వికలాంగుల సౌకర్యార్థం టెంటు వంటి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేదన్నారు.మన్నాపురం గ్రామంలో సైతం ఉపాధి కూలీలు ఇటువంటి సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కూలీలు పస్తులు ఉంటూ పనిచేస్తున్నప్పటికీ చేసిన పనికి గాను కూలీలు ఇవ్వకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. మూడు నెలల నుండి కూలీలు రావాలని చెబుతున్నారని, కానీ అధికార యంత్రాంగం మాత్రం ఫిబ్రవరి 5 లోపు వరకు అందరికీ కూలీల ఖాతాలో జమ అయ్యాయని అంటున్నారని,కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి తోడు స్థానిక అధికార యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ కరువవడంతో కూలీలకు కనీస సౌకర్యాల కల్పన గగనమైందన్నారు. ఉపాధి పనులు జరుగుతున్న చోట అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.తక్షణమే కూలీలకు ఇవ్వాల్సిన నగదు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు హనుమంతు,అమ్రేష్,రంగన్న, ఫాతిమా లాల్ సాబ్,నాగేష్,సవారన్న,శివన్న తదితరులు పాల్గొన్నారు. పెద్దపాడు డ్యాం గ్రామాలతో పాటు, ప్రతి గ్రామంలో వెంటనే ఉపాధి పనులు ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలి. పని ప్రదేశాలలో కూలీలకు మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంటు, ప్రధమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలి. పెండింగ్ లో ఉన్న కూలీలను వెంటనే ఇవ్వాలి.సాంకేతిక సమస్యలను అధికార యంత్రాంగం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



# ఫ్రీడం పార్క్‌లో సీనియర్ సిటిజన్స్‌కు బెంచెస్ ఏర్పాటు

### బాలాజీ నగర్ హౌసింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సాధు ప్రతాపరెడ్డి

**కూకట్ పల్లి, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, బాలాజీ నగర్ డివిజన్ లో గల ఫ్రీడమ్ పార్క్ లో సీనియర్ సిటిజన్స్ కూర్చోవడానికి వీలుగా ఉండేందుకు బాలాజీ నగర్ హౌసింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సాధు ప్రతాపరెడ్డి తన సొంత నిధులతో బెంచెస్ ను శుక్రవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ పార్క్ లో వచ్చి కూర్చోడానికి వీలుగా బెంచెస్ సౌకర్యవంతంగా ఉన్నాయి అని హర్షం వ్యక్తశీ చేశారు. మేము అడగ్గానే మా కోసం బెంచెస్ డొనేట్ చేసినందుకు కాలనీ అధ్యక్షుల సాధు ప్రతాపరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

# అదిగో చిరుత....

### సీసీ పుటేజ్ లో రికార్డు అయిన చిరుత సంచారం దృశ్యాలు

### గత మూడు నెలలుగా భయాందోళనలో గ్రామస్తులు

### చిరుతను బంధించేందుకు అటవీశాఖ అధికారుల ముమ్మర ఏర్పాట్లు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**



అదిగో పులి.. ఇదిగో పులి అంటూనే నెలలు గడిచాయి. ఎక్కడ ఎప్పుడు ఏవిధంగా దాడిచేస్తుందోనంటూ స్థానికులు ప్రతి నిత్యం భయంతో బెంబెలెత్తిపోతున్నారు. చిరుత కదలికలపై నిఘా పెట్టిన అటవీ ప్రాంతంలో ప్రత్యేక సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి చిరుత సంచరిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ మేరకు అటవీశాఖ అధికారులు చిరుతను ఏ విధంగా బోనులో బంధించాలనే కోణంలో పథకాలు రచిస్తున్నారు. శుక్రవారం అటవీప్రాంతంలో అధికారులు పర్యటించి మరో సారిచిరుత కదలికలపై నిఘా పెట్టే అవకాశం ఉంది. ఎట్టకేలకు చిరుతను బంధీచేసే యత్నంలో అటవీశాఖ అధికారులు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. గత కొన్ని నెలలుగా మల్దకల్ మండలంలో సంచరిస్తున్న చిరుతను ఎట్టకేలకు ఫారెస్టు అధికారులు కనిపెట్టారు. మండలంలో ఆయా గ్రామాలల్లో మూగ జీవులపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి అపహరించి ఎత్తుకెళ్తున్నట్లు గుర్తించారు. నేతువానిపల్లి గ్రామ శివారులోనే ఏకంగా 8 ఆవుదూడలు చిరుతదాడిలో మృతి చెందాయి. దీంతో బెంబేలెత్తిన గ్రామస్తులు చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ పొలాలో పడిన కాళ్ల ముద్రల కొలతలు సేకరించిన అధికారులు ఇదీ కచ్చితంగా చిరుత జాడలే అని దృవీకరించారు. తాజాగ నేతువానిపల్లి గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు అనుమానించడంతో చిరుత కదలికలను గమనించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగ్గారు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు ఆధ్వర్యంలో నేతువానిపల్లి అటవీ ప్రదేశంలో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చనిపోయిన ఓ మూగ జీవిని అడవిలో వదిలేసి సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షించారు. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఓ సీసీ కెమెరాలో చిరుతపులి సంచరిస్తున్న వీడియో రికార్డు అయ్యింది. మూగజీవిని తీసుకెళ్లే దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు చిరుతపులిని పట్టుకునేందుకు చర్యలు ముమ్మరం చేశారు. వీలైనంత త్వరగా చిరుతను బంధించే ప్రయత్నం చేస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారులు వెల్లడించారు.

# యోగతో మానసిక ఒత్తిడి జయించవచ్చు

### ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**



యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో హెల్త్ వీక్ లో భాగంగా శనివారం గచ్చిబౌలి స్టేడియంలో యోగా దినోత్సవ దినం నిర్వహించారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రహదారులు , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా గారు పాల్గొని ప్రజలు నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక సమగ్ర పరిష్కారమని అన్నారు. యోగా సాధన ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి జీవన శైలి సంబంధిత వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. యోగా కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని అన్నారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడం వల్ల వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మొత్తానికి సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయడం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ మెడికల్ , హెల్త్ క్రిస్టినా చోగ్తూ , జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి ,హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి జిల్లాఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా హయత్ డాక్టర్ పూనం డిపిఓ అక్రమ్ , అధికారులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అంజయ్య నగర్ సమస్యలపై డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన ఆంజనేయులు సాగర్‌లి

# అంజయ్య నగర్ డివిజన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### నాయకుడు ఆంజనేయులు సాగర్ డిమాండ్

### వీధి దీపాలు స్మశాన వాటిక పనులపై డిప్యూటీ కమిషనర్‌తో ఆంజనేయులు సాగర్ బృందం భేటీ

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 10,( ప్రభాత ఉదయం )**

అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డివిజన్ నాయకుడు ఆంజనేయులు సాగర్ డిప్యూటీ కమిషనర్ఎన్. బాలకృష్ణని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్, రాజీవ్ నగర్, బంజారా నగర్, గుల్షన్ నగర్ పీజేఆర్ నగర్ ప్రాంతాల్లో వీధి దీపాల కొరత తీవ్రంగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చీకటి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అవసరమైన చోట్ల కొత్త వీధి లైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, స్థానిక ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ సమస్యను కూడా వివరించారు. అంజయ్య నగర్ స్మశాన వాటిక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీనివల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఎన్. బాలకృష్ణ, క్షేత్రస్థాయిలో పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ సురేష్ సాగర్, పి. లక్ష్మయ్య సాగర్, రామకృష్ణ సాగర్, రోహిత్ సాగర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



# చిరు వ్యాపారులు తోపుడు బండ్లతో వ్యాపారం చేసుకొనే పేదలపై ప్రతాపం చూపిస్తే ఊరుకునేది లేదు

### కూకట్ పల్లి హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**

చిరు వ్యాపారుల పొట్ట కొట్టి రోడ్డుపక్కన ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్న వారి కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కూకట్ పల్లి శాసన సభ్యుడు మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే వారికి బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో వెండింగ్ జోన్ లను ఏర్పాటు చేసి వారికి గుర్తింపు కార్డులను అందజేయడం జరిగిందన్నారు. గత పదేళ్ల బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో పేదల జోలికి, చిరు వ్యాపారుల జోలికి వెళ్లకుండా వారు యథేచ్ఛగా వ్యాపారాలు చేసుకొని జీవనం సాగించే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లుగా భరత్ నగర్ మొదలుకొని కెపిహెచ్బి కాలనీ వరకు కూకట్ పల్లి నియోజకవర్గంలోని నిరుపేదలు, చిరు వ్యాపారులు లక్ష్యంగా నిత్యం కూల్చివేతలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వారు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పొట్ట చేతపట్టుకొని బ్రతుకుదెరువు కోసం వచ్చిన వారేనని, పిల్లలను చదివించుకుంటూ కుటుంబ భారాన్ని మోస్తున్నవారని, వారి జీవనాధారాన్ని తొలగించడం ద్వారా వారి కుటుంబాలను రోడ్డు పాలు చేయడం ధర్మం కాదని అన్నారు. మున్సిపల్, ట్రాఫిక్ విభాగాల అధికారులు అవసరానికి మించి వ్యవహరిస్తున్నారని, నచ్చినవారికి ఒకలా నచ్చనివారికి మరోలా సేవలను వినియోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లను, పక్కనే ఉన్న ఖాళీ స్థలాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ కోసం వాడుతున్న పెద్ద పెద్ద వ్యాపారసంస్థల వద్ద నిత్యం లాలూచీ పడుతూ పేదలపై మాత్రం ప్రతాపం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన రెండు మూడు రోజులుగా కెపిహెచ్బి పరిసర ప్రాంతాల్లో చిరువ్యాపారులను తొలగించడంతో వారంతా శుక్రవారం ఉదయాన్నే ఏమ్మెల్యే కార్యాలయానికి వచ్చి గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో స్పందించిన ఏమ్మెల్యే అటు మున్సిపల్ అధికారులకు ఇటు పోలీసు అధికారులకు చిరువ్యాపారుల పొట్ట కొట్టొద్దని, వారికి వ్యాపారం చేసుకొని జీవనం సాగించే అవకాశం కల్పించాలని సూచించారు.

# పంచమి కాలనీలో డ్రైనేజీ సమస్యకు కాంగ్రెస్ నేత జిల్లా గణేష్ చొరవతో శాశ్వత పరిష్కారం

**కూకట్ పల్లి, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**



శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పంచమి కాలనీ మెయిన్ రోడ్డులో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లడంతో వాహనదారులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా మురుగు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణానికి ఆటంకం ఏర్పడటమే కాకుండా దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై స్థానికుల నుంచి సమాచారం అందుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. వారి చొరవతో మున్సిపల్ సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టి, మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన సిల్ట్ మొత్తాన్ని తొలగించారు. దీంతో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చేసి సమస్యకు తక్షణ పరిష్కారం కల్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు స్పందిస్తూ, తక్షణమే సమస్యను గుర్తించి పరిష్కరించిన జిల్లా గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచమి గణేష్, కెథర్ నాని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నూతన పద్ధతుల్లో కుంకుమపువ్వు సాగుపై పరిశోధనలకు ప్రయోగశాల ప్రారంభం

### తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ బీ.ఉదయభాస్కర్

**కొత్తకోట (మోజర్ల), ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**






ఆధునిక సాంకేతిక పద్ధతులు, ఆవిష్కరణల అనువర్తనాలతో భవిష్యత్తులో వ్యవసాయ, ఉద్యాన అనుబంధ రంగాల్లో గణనీయమైన మెరుగుదల సాధ్యమవుతుందని తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ బి. ఉదయభాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకించి కుంకుమపువ్వు సాగుపై రాష్ట్రంలో ఆధునిక పద్ధతుల్లో సమగ్ర పరిశోధన లు చేపట్టేందుకు గాను వనపర్తి జిల్లాలోని మోజెర్లలో గల ఉ ద్యాన కళాశాలలో ఏరోపోనిక్ కుంకుమ పువ్వు ప్రయోగశాల ను ఆయన ప్రారంభించారు.ఏరోపోనిక్ పద్ధతిలో కృత్రిమ నియంత్రిత వాతావరణంలో కుంకుమపువ్వు సాగు తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ప్రయోగాత్మక ఫలితాలు ఇచ్చిందని, దీంతో భవిష్యత్తులో పురుగు, తెగులు మందుల అవశేషాలు లేని అత్యంత నాణ్యమైన కుంకుమపువ్వు అధిక దిగుబడి సాధ్యమని ఆయన అన్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలోని ఉద్యాన కళాశాలలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఏరోపోనిక్ పద్ధతిలో తెలంగాణలో కుంకుమపువ్వు సాగుపై ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసిందని, అందులో ప్రత్యేకించి వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడకానికి అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందని, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్, సెన్సార్ ఆధారిత సాగు, ఏరోపోనిక్ పద్ధతిలో కుంకుమపువ్వు సాగు వంటి ఆవిష్కరణలు అంకుర పరిశ్రమల స్థాపనకు అత్యంత దోహదం చేస్తాయని పేర్కొన్నారు. నూతన పరిజ్ఞానంతో సాగులో రైతుల ఆదాయాలు పెంచేందుకు ఉన్న మార్గాలు, పద్ధతులు అన్నిటికీ నాబార్డ్ ప్రోత్సహిస్తుందన్నారు.ఉష్ణోగ్రత, కృత్రిమ సూర్య రష్మీ, గాల్లో తేమ, అన్నిటిని నియంత్రిస్తూ నాణ్యమైన కుంకుమ పువ్వు ఎక్కువ దిగుబడి తీసుకోవడానికి నాబార్డ్ ఆర్థిక సాయంతో వర్సిటీ కొనసాగించిన ప్రయోగాలు బాగున్నాయన్నారు. త్వరలో పూర్తిస్థాయి ఫలితాలు వచ్చిన తర్వాత ఏరోపోనిక్ పద్ధతిలో కుంకుమపువ్వు సాగు యూనిట్ కాస్టు సిద్ధం చేస్తామని తెలిపారు. నైపుణ్యం పెంచుకుంటే విద్యార్థి ఆధారిత అంకుర పరిశ్రమలు, ఎంటర్ప్రెన్యూర్షిప్ కు భవిష్యత్తులో అత్యంత ఆదరణ ఉంటుందని తెలిపారు. మంచి మార్కెట్ డిమాండ్ ఉన్న కూరగాయలు, పండ్ల తోటల వైపు రైతులు ఆసక్తి చూపాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకించి కొత్త టెక్నాలజీలకు మంచి ప్రాధాన్యత, అవకాశాలు ఎక్కువైననే తెలిపారు.ఆధునిక సాంకేతిక అంశాలు పై పరిశోధన చేపట్టి రైతులకు ఎప్పటికప్పుడు అందజేస్తామని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ డి రాజి రెడ్డి డాక్టర్ అన్నారు. శాస్త్రీయ టెక్నాలజీ ఆధారిత సాగు రైతులు ఉ ఒడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కుంకుమపువ్వు ప్రాజెక్టు పరిశోధకులు ప్రొఫెసర్ పెడిగం సైదయ్య, వర్సిటీ డీన్ డాక్టర్ జె. చీనా, ఉద్యాన అధికారి విజయభాస్కర్ రెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ వీణ జోషి, డాక్టర్ షహనాజ్, నాబార్డ్ అధికారులు షణ్ముఖ చారి, మనోహర్ రెడ్డి, ప్రొఫెసర్లు, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక నుంచి వచ్చిన అభ్యర్థులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## ఘనుగుపహాడ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఎన్నిక

### గౌరవ అధ్యక్షుడిగా ఇరుగు సిద్ధులు.. అధ్యక్షుడిగా తుపాకుల రాములు

**జనగాం, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**



జిల్లా లోని జనగామ మండలం, ఘనుగుపహాడ్ గ్రామంలో శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా తుపాకుల రాములు ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఇరుగు సిద్ధులు, తాటి లక్ష్మీనారాయణ లను, ఉపాధ్యక్షులుగా మాల్గ మహేందర్, కొర్ర రంగ్యా, కన్నెబోయిన రమేష్, గుర్రం నగేష్ లను, జనరల్ సెక్రెటరీగా గుర్రం మల్లేష్ ను, జాయింట్ సెక్రెటరీగా కన్నెబోయిన బాలరాజును, కోశాధికారిగా బబ్బురు సంతోష్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా బండిరాజుల రాజు ,శివరాత్రి ప్రశాంత్, గుర్రం నరేష్, సిరిసినగండ్ల మురళి, శానాబోయిన గట్టయ్య, కూకట్ల వెంకటయ్య ,గోనెల మల్లేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## గడ్డపోతారం న్యూట్రల్ రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం

### మంటలను అదుపు చేసిన అగ్ని మాపక సిబ్బంది

**పటాన్ చెరు, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**




సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని పారిశ్రామిక వాడలో న్యూట్రల్ కెమికల్స్ పరిశ్రమ ఆవరణలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రసాయన డ్రమ్ములు నిల్వ ఉంచిన చోట ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని కార్మికులు చెప్పారు. ప్రమాదంలో ఎగిసిపడే మంటలను అదుపు చేయడానికి పరిశ్రమ కార్మికులు, అగ్ని మాపక సిబ్బంది ఎంతగానో శ్రమించారు. ఈ ప్రమాదంలో సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో మరిన్ని పరిశ్రమలు ఉండడంతో ఇతర పరిశ్రమలకు మంటలు వ్యాపించకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అంత వరకు పెద్ద ఎత్తున ప్రమాదం జరిగినప్పటికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

**పెబ్బేరు, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**

కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఎండి సలీం రిసెప్షన్ పెబ్బేరు పట్టణంలో సహారా ఫంక్షన్ హాల్ శుక్రవారం జరిగింది. ఈ వివాహ వేడుకల్లో రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మాజీ సి డి సి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు లోకా రెడ్డి, మహిపాల్ రెడ్డి, గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించి వాహనదారులతో డీసీపీ ఇతర అధికారులు.

## హెల్మెట్ ఉన్నా స్ట్రాప్ లేకుంటే జరిమానా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

**శేరిలింగంపల్లి ఏప్రిల్ 10, (ప్రభాత ఉదయం)**

ద్విచక్ర వాహనదారుల భద్రతే లక్ష్యంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించని వారితో పాటు, హెల్మెట్ ఉండి కూడా స్ట్రాప్ పెట్టుకోని వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ నెల 9,10 తేదీల్లో రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రెండు రోజుల్లో భారీగా చలానాలు ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ రంజన్ రతన్ కుమార్, అడిషనల్ డిసిపి హనుమంత రావు, పర్యవేక్షణలో జరిగిన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీగా కేసులు నమోదు చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చెస్తున్న 3,072 మందికి చలానాలు విధించటం జరిగింది. హెల్మెట్ స్ట్రాప్ పెట్టుకోని 173 మందికి కూడా చలానాలు వేసినట్లు చెప్పారు. ప్రాణ రక్షణకే కోసమే ఈ చర్యలు డిసిపి రంజన్ రతన్ కుమార్ వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమైక్య లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

### పాడి పరిశ్రమ విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం):**



జిల్లా లోని దేవరుప్పుల మండల కేంద్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కీలకమైన విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి , తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమైక్య లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. కొత్తగా ప్రారంభమైన ఈ సహకార భవనం ద్వారా పాల సేకరణ, నిల్వ, పంపిణీ వంటి సేవలు ఒకే చోట అందుబాటులోకి వచ్చి రైతులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.తద్వారా రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా డెయిరీ ద్వారా మంచి ధరలు పొందే అవకాశముంటుందని, మహిళా సంఘాలు కూడా పాడి పరిశ్రమలో భాగస్వామ్యం కావడం ద్వారా ఆర్థికంగా బలపడతాయని ఎమ్మెల్యే తెలిపారు..చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి గారు మాట్లాడుతూ, తెలంగాణలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. విజయ డెయిరీ ద్వారా రైతులకు పారదర్శకంగా సేవలు అందిస్తూ, నాణ్యమైన పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ సహకార భవనం పాడి రైతుల అభివృద్ధికి కేంద్రంగా మారి, మరింత మంది రైతులను ఈ రంగంలోకి తీసుకురావడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెద్ది కృష్ణ మూర్తి, ప్రజాప్రతినిధులు, డెయిరీ సంఘ సభ్యులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హెచ్పీవీ టీకాతో సర్వైకల్ క్యాన్సర్ నివారణ

### డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం):**




సర్వైకల్ క్యాన్సర్ నివారణలో హెచ్పీవీ టీకా కీలక పాత్ర పోషిస్తుందని డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు పేర్కొన్నారు.శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన (హ్యూమన్ పాపిలోమా వైరస్) హెచ్పీవీ టీకాపై డీఎల్సీసీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో 14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాలు మించని ఆడపిల్లల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు జిల్లాకు మొత్తం (1079) టీకాలు కేటాయించగా (625) మంది ఆడపిల్లలకు టీకాలు విజయవంతంగా పూర్తిచేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో వచ్చే వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీసీహెచ్ఎస్ నరేంద్ర శర్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, డీడబ్ల్యూఓ కోదండరాములు, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మేజర్ పద్మపాని ఆచార్యమెడిటేషన్ హాల్‌లో యోగా దినోత్సవం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**




హస్తినాపురం లో ఘనంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ లో భాగంగా యోగా దినోత్సవం మేజర్ పద్మపాని ఆచార్యమెడిటేషన్ హాల్ హస్తినాపురం లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వనస్థలిపురము సూపరిండెంట్ డాక్టర్ నాగేందర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాధిక ,డాక్టర్ రాకేష్ ,డిప్యూటీ డీఎం హ్ చ్ ఓ డాక్టర్ గీత నర్సింగ్ విద్యార్థులు ,వైద్య సిబ్బంది యోగ నిపుణులు పాల్గొన్నారు




## మల్కారం గ్రామంలో చట్టాలపై అవగాహన కార్యక్రమ..

**రాజేంద్రనగర్,ఏప్రిల్10(ప్రభాత ఉదయం):**

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహనను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికాంత్ రెడ్డి అన్నారు.రంగరెడ్డి జిల్లా రాజేంద్రనగర్ న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ...ప్రతి చిన్న విషయాన్ని పోలీసుస్టేషన్ లు,కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం వృధా చేసుకోవద్దన్నారు.ఉచిత న్యాయ సలహాలు,సూచనల కోసం రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి సూచనలను పాటించి నిర్ణయాలను తీసుకోవాలని తెలిపారు.స్థానిక ఇన్ స్పెక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ...సివిల్ తగాదాలకు కోర్టుల ద్వారా న్యాయస్థానాలను ఆశ్రయించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలను తెలిపారు.ద్విచక్ర వాహనాలను నడిపే వారు తప్పకుండా హెల్మెట్ పెట్టుకొని నడుపాలని తెలిపారు.కార్లు నడిపేవారు సీటు బెల్టు సరిగ్గా ధరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిక్షపతి రెడ్డి,ఉపసర్పంచ్ రోహిత్ కుమార్,డాక్టర్ దివ్యశ్రీ,సుమిత్ర,రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ కార్యదర్శి నరసంహచారి,పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రెడ్డి,జిల్లా న్యా మిసేవాధికార సంస్థ సబ్బంది నరేశ్ గౌడ్,సంజీవ,బాల్ రెడ్డి,సింబాయసిస్ కళాశాల న్యాయ విద్యార్థులు,గ్రామస్తులు పాల్గొన్నారు.




## దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

### రూ.5.20 లక్షల సొత్తు స్వాధీనం

**రాజేంద్రనగర్,ఏప్రిల్10(ప్రభాత ఉదయం)**

మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో వరుస ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు.రూ.5.20లక్షల విలువైన బంగారు ఆభరణాలు,మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ వివరాలను రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ వెల్లడించారు.ఈ నెల 5న జరిగిన దొంగతనం కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు షేక్ షబ్బీర్ (24)ను అదుపులోకి తీసుకున్నారు.రాత్రివేళల్లో తలుపులు తెరిచి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేయడం అతని నేర పద్ధతి అని పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుండి బంగారు ఉంగరాలు,వంకీ,పుస్తెల తాడు,అలాగే ఒప్పొ,ఐఫోన్ మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.గతంలో కూడా గుంటూరు జిల్లాలో పలు దొంగతనం కేసుల్లో నిందితుడికి సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.





## క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలి

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### భానూరులో ఘనంగా ప్రారంభమైన టంగుటూరి అంజయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్

**పటాన్ చెరు, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం):**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత నేత టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తిని స్మరిస్తూ కిడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి. వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# గద్వాల్ ఆర్టీసీ బస్టాండ్‌లో త్రాగునీటి కోసం తండ్లాట

## పని చేయని ఫిల్టర్ వాటర్.... నీళ్లు కావాలంటే కొన్నాల్సిందే

### తాగు నీరు లేక ప్రయాణికుల ఇక్కట్లు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌పై అధికారులు కనీస పట్టింపు చూపడం లేదు. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమవుతోంది. ఈ బస్టాండ్ నుంచి ప్రతిరోజూ తెలంగాణలోని పలు పట్టణాలు, ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి, కర్నూల్, శ్రీశైలం, మంత్రాలయం, విజయవాడ, కర్ణాటక లోని రాయచూర్, బెంగుళూరు వంటి పట్టణాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గద్వాల్ ఆర్టీసి ప్రాంగణాల్లో మరుగుదొడ్ల నిర్వహణ లేకున్నా..అదనపు రుసుము వసూలు చేస్తున్నా..కనీస తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ లేకున్నా..దుకాణాల్లో అధిక ధరలకు అమ్ముతున్నా పట్టించుకున్న నాథుడే లేరు. ఆర్టీసి బస్టాండ్లపై అధికారుల పర్యవేక్షణ లేమి స్పష్టంగా కనిపిస్తోంది.

**తాగు నీరు లేక ప్రయాణికుల ఇక్కట్లు**

గద్వాల్ ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. చల్లని నీరు లేకపోగా కనీసం తాగడానికి నీటి సరఫరా కూడా సరిగా చేయడం లేదు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ అలంకార ప్రాయంగా మారింది. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఫిల్టర్ వాటర్ ఫ్రిడ్జి గత కొంతకాలంగా మరమ్మతులు నోచుకోలేదు. ఆర్టీసి అధికారుల పర్యవేక్షణ కొరవడిందని చెప్పకోవచ్చు. మండుతున్న ఎండలకు గొంతు ఎండుతోందని త్రాగు నీటి సౌకర్యం లేకపోవడంతో త్రాగునీళ్లు కొన్నేపరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేధన చెందుతున్నారు. దీనికి తోడు బస్టాండ్ లో ఫ్యాన్ సౌకర్యాలు లేక ఉక్కపోతకు గురై ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గద్వాల ఆర్టీసి అధికారులు స్పందించి బస్టాండ్ లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# ఉన్నత లక్ష్యాలే విజయానికి తొలి అడుగు సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రావీణ్య

## 9,12 తరగతులే జీవితానికి కీలకం నీట్, జెఈఈ, ఎంసెట్ కు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచన

**పటాన్ చెరు, ఏప్రిల్ 10( ప్రభాత ఉదయం)**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. శుక్రవారం పటాన్ చెరు మండలం ముత్తంగిలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ తర్వాత ఉండే పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని సూచించారు. విద్యార్థి జీవితంలో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అత్యంత కీలక దశగా పేర్కొన్నారు. ఈ సమయంలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా నీట్, జెఈఈ అడ్వాన్స్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ అందిస్తున్నదని చెప్పారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతిష్టాత్మక కళాశాలల్లో సీట్లు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. జీవితంలో ఎదురయ్యే అవాంతరాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని, కష్టపడే వారికి విజయమే ప్రతిఫలమని కలెక్టర్ పేర్కొన్నారు. చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమని ఆమె వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసినచపాతీ మేకింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భనలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కామధేను ఫౌండేషన్ ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు .

# జాతీయ పోలీస్ డ్యూటీ మీట్‌లో సైబరాబాద్ పోలీసులకు పథకాల పంట

## రాష్ట్రానికి వచ్చిన 12 పతకాల్లో 6 పతకాలు సైబరాబాద్ ఖాతాలోనే.

### విజేతలకు ఇంక్రిమెంట్లు ప్రకటించిన సీపీ డా. ఎం. రమేష్

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 10,( ప్రభాత ఉదయం)**

నాగ్‌పూర్‌లో నిర్వహించిన 69వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అధికారులు అసాధారణ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం వరుసగా మూడోసారి చార్మినార్ ట్రోఫీని కైవసం చేసుకొని సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్రం సాధించిన మొత్తం 12 పతకాల్లో సైబరాబాద్ పోలీసులు 6 పతకాలు సాధించారు. ఇందులో 3 స్వర్ణం, ఒకటి రజతం, 2 కాంస్యం పథకాలు సాధించినట్లు తెలిపారు.



పోలీస్ డ్యూటీ మీట్ పథకాలు సాధించిన పోలీసులను అభినందిస్తున్న సీపీ ఇతర అధికారులు.

**విజేతలను ఘనంగా సత్కరించిన సీపీ**

ఈ చారిత్రాత్మక విజయం పట్ల సీపీ హర్షం వ్యక్తం చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ కమిషనరేట్ ఆడిటోరియంలో విజేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణ వంటి కఠినమైన విధుల్లో ఉంటూనే జాతీయ స్థాయి పోటీల కోసం సమయాన్ని కేటాయించి పతకాలు సాధించడం వారి అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. పోలీసు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీపీ కీలక ప్రోత్సకాలను ప్రకటించారు. గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులకు మూడు ఇంక్రిమెంట్లు సిల్వర్ మెడల్ విజేతలకు రెండు ఇంక్రిమెంట్లు బ్రాంజ్ మెడల్ కు ఒక ఇంక్రిమెంట్ ప్రకటించారు. ఎం.వి.ఎస్.ఎన్. రెడ్డి (ఏఆర్ఎస్ఐ) కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో స్వర్ణ పతకం. ఎం. దేవేంద్ర ప్రసాద్ (ఏఆర్‌హెచ్‌సీ) వీడియోగ్రఫీలో స్వర్ణ పతకం, ఆర్. దివాకర్ రెడ్డి (ఏఆర్‌పీసీ) యాంటీ సాబోటాజ్ చెక్ విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. పి. జయప్రకాశ్ గౌడ్ (ఎస్ఐపీ) మెడికో–లీగల్ ఓరల్ విభాగంలో రజత పతకం, కె. రాధిక యాదవ్ (ఎస్ఐపీ) మెడికో–లీగల్ ఓరల్ విభాగంలో కాంస్య పతకం, టీ. సురేష్ (ఏఆర్‌పీసీ) వీడియోగ్రఫీ విభాగంలో పతకం సాధించారు. ఆర్. ప్రేమ్ సాగర్ (ఎస్ఐపీ జీడిమెట్ల) సైంటిఫిక్ ఎవిడేన్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఓవరాల్ రన్నర్స్ ట్రోఫీ సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

## చలివేంద్రం ఏర్పాటు కేవలం సేవ కాదు ఇది ప్రతి ఒక్కరి బాధ్యత

### టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం)**



ఒక గ్లాస్ నీరు ఇవ్వడం ఒక జీవితాన్ని నిలబెట్టడం అని, చలివేంద్రం ఏర్పాటు కేవలం సేవ కాదు ఇది మన బాధ్యత ఇది కేవలం కార్యక్రమం కాదు ఇది మన సంస్కారం అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. వేసవి ని దృష్టిలో పెట్టుకుని "ప్రజల దాహం తీర్చేందుకు ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్, ఆల్విన్ కాలనీ లాస్ట్ బస్ స్టాప్ నందు ఏర్పాటు చేసిన చల్లని తాగునీరు (చలివేంద్రాన్ని) మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి డివిజన్లలో ఒక చలివేంద్రం ఏర్పాటు ద్వారా వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు, ఒక్క గ్లాస్ చల్లని నీరు కూడా ప్రాణాలను కాపాడగలదని అన్నారు. అలాంటి సమయంలో ఏర్పాటు చేసే చలివేంద్రం అనేది దాహంతో అలమటించే వారికి ఒక చిన్న ఆశ్రయం, ఒక గొప్ప ఉపశమనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, కట్ల శేఖర్ రెడ్డి, నర్సింగ్ రావు, రెహ్మాన్, సంగమేష్, వాసు, శివ, ప్రభాకర్, గోపాల్, నవాజ్, పాండు, దేవ, వాసుదేవరావు, శ్రీనివాస్ గౌడ్, బాల స్వామి, బొర్రా నాగేశ్వర్ రావు, దేవ, రఫీక్, శ్రీను, ఆంజనేయులు, వీరేష్ చారి, రాంరెడ్డి, అబ్దుల్, కలీల్, షంషు, నరేష్, రాము, మగ్దుం, రామయ్య, మూర్తి, డేవిడ్ రాజు, వెంకటేష్, వెంకట్ రావు, ఏడుకొండలు, శేఖర్, సురేష్, రమేష్, రాజ్ కుమార్, మహేష్, నరేందర్, గుడ్ల శ్రీను, తెనాలి పంతులు, ఎస్ రాములు, ఎం రవి, నాగయ్య గౌడ్, సూరి బాబు, మురళి, మున్నా భాయి, గోపి, శ్రీనివాస్, శేఖర్, కృష్ణ, జైరామ్, మధు, లక్ష్మణ్, గౌరీ శంకర్, మహేష్, సురేష్, రమేష్, మహిళలు శిరీష సత్తూర, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే ప్రభుత్వ ధ్యేయం - ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం

## ఈ నెల 13 నుంచి 18 వరకు అరైవ్ - అలైవ్ కార్యక్రమాలు

## 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక చర్యలు

## ప్రమాదాల నివారణకు శాఖల సమన్వయం

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం):**



ప్రజల భద్రతే ప్రభుత్వ ధ్యేయమని, ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా "అరైవ్ – అలైవ్" కార్యక్రమం అమలుపై కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుంచి 18 వరకు చేపట్టనున్న అరైవ్ – – అలైవ్ కార్యక్రమాలను జిల్లాలో విస్తృత స్థాయిలో నిర్వహించాలని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రోడ్ భద్రత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు వీలుగా చేపట్టే అరైవ్ – అలైవ్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. 13న అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వీలుగా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేలా చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక పక్కాగా ఉండాలన్నారు.

అరైవ్ – అలైవ్ కార్యక్రమాలు పోలీస్, రవాణా, వైద్యారోగ్య, విద్యా, మిగతా అన్ని శాఖలు సమన్వయంతో షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో, అలాగే మున్సిపాలిటీల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు.

అరైవ్ – అలైవ్ వారోత్సవాలు -- శాఖల వారీగా కార్యాచరణ

రవాణా శాఖ వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం, డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలనలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రచారం.

పోలీస్ శాఖ

రోడ్డు భద్రత నియమాల అమలు, స్పీడ్ కంట్రోల్ డ్రైవ్స్, మద్యం సేవించి డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు.

ఆరోగ్య శాఖ

ఆపత్కాల సమయంలో ప్రథమ చికిత్స (ఖీఱతీర్ ాూఱుం)పై శిక్షణ, అత్యవసర వైద్య సేవల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు. విద్యా శాఖపాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు, వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహణ.

మున్సిపల్/పంచాయతీ శాఖలు

రోడ్ల సంరక్షణ, ట్రాఫిక్ సైన్ బోర్డులు ఏర్పాటు, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక సూచనలు ఏర్పాటు.

ఎన్‌జీఓలు/స్వచ్ఛంద సంస్థలు

జనాల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడం, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. ఈ సమీక్ష సమావేశంలో ఏసిపి పండరి చేతన్ నితిన్, ఆర్డీఓ వెంకన్న, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్టీఏ సభ్యులు అభి గౌడ్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో భారీ మోసం

## కామెల్-క్యూ' సంస్థ సీఈఓ సహా ముగ్గురి అరెస్టు

## దాదాపు 5 కోట్ల రూపాయల మేర నిరుద్యోగులకు కుచ్చుటోపీ

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 10,(ప్రభాత ఉదయం)**



ఐటీ ఉద్యోగాలు పేరుతో మోసం చేసిన నిందితులతో పోలీసులు.

సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, శిక్షణ ఇస్తామని నమ్మించి వందలాది మంది నిరుద్యోగుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన ఘరానా మోసాన్ని మాదాపూర్ పోలీసులు బట్టబయలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు 'కామెల్–క్యూ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ సీఈఓ ఎరుకుల మహేష్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. జనగామకు చెందిన ఎరుకుల మహేష్ (31) గతంలో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేశాడు. ఆ సమయంలో కొన్ని సంస్థలు నిరుద్యోగుల నుంచి అక్రమ పద్ధతుల్లో (బ్యాక్‌డోర్ ఎంట్రీ) డబ్బులు వసూలు చేసి మోసం చేయడాన్ని గమనించాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మహేష్ అదే తరహాలో 2024 ఆగస్టులో కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీ బిల్డింగ్‌లో 'కామెల్–క్యూ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్' పేరుతో సంస్థను ప్రారంభించాడు. ఆ తర్వాత మాదాపూర్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలలో మరిన్ని శాఖలను తెరిచాడు. నిందితులు నిరుద్యోగ యువతకు సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ ట్రైనింగ్ ఇస్తామని, ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తామని నమ్మబలికారు. ఒక్కో అభ్యర్థి నుండి రూ. 80,000 నుండి రూ. 3,00,000 వరకు వసూలు చేశారు. మొత్తం 452 మంది అభ్యర్థులను చేర్చుకోగా, వారిలో సుమారు 322 మంది నుండి భారీగా నగదు వసూలు చేశారు. ఇలా సుమారు 5 కోట్ల రూపాయల వరకు వసూలు చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మొదట్లో కొందరికి జీతాలు చెల్లించినప్పటికీ, ఆ తర్వాత జీతాలు ఇవ్వడం ఆపేయడమే కాకుండా డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి ఇవ్వకుండా కంపెనీని మూసివేసి నిందితులు పరారయ్యారు. ఎరుకుల మహేష్ కంపెనీ సీఈఓ. షేక్ నజీర్ బాషా ఆపరేషన్స్ హెడ్. కురపాటి ఉదయ లక్ష్మి హెచ్‌ఆర్ మేనేజర్. మరో ఏడుగురు నిందితులు రాంబాబు, షరీఫ్, శ్రీకాంత్ రెడ్డి, మహితా, ఝాన్సీ, ప్రభాకర్, అబ్దుల్ రహీమ్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సీజ్ చేసిన వస్తువులు: నిందితుల నుండి ఒక మారుతి ఈకో వాహనం, యమహా ఫాసినో స్కూటర్, రెడ్‌మీ నోట్ 14 ప్రో మొబైల్ ఫోన్, బ్యాంక్ పాస్ బుక్కులు, చెక్ బుక్కులు, రబ్బర్ స్టాంపులు తోపాటు కంపెనీకి సంబంధించిన కీలక పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటికే మాదాపూర్, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కుకట్‌పల్లి జోన్ డిసిపి రీతి రాజ్ పర్యవేక్షణలో మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ డి. కృష్ణ మోహన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి. విజయ్ నాయక్ సిబ్బంది ఈ కేసును ఛేదించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# నేలకొరిగిన నీలగిరి చెట్టు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఓ భారీ వృక్షం శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలింది. ఎంతో కాలంగా ఆఫీస్ ఆవరణలో ఉన్న ఈ వృక్షం విరిగిపడిపోవడంతో అధికారులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నేలకొరిగిన వృక్షం ద్విచక్ర వాహనంపై పడటంతో వాహనం ధ్వంసమైంది.

# రైతులకు అండగా నిలిచిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవేంద్ర రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10(ప్రభాత ఉదయం)**



ఎండాకాలం లో వరి పంటలకు ర్యాలంపాడ్ రిజర్వాయర్ నుండి వస్తున్న నీటినీ పిల్ల కాలువలో ఉన్న జమ్మూ ,చెట్లు,చెదారం అడ్డంగా ఉండడంతో రైతులు పొలాలకు నీరు వెళ్ళలేక వరి పంటలు ఎండి పోవడానికి సిద్ధంగా ఉన్న స్థితిలో పలువురు రైతులు రాఘవేంద్ర రెడ్డి ని సంప్రదించగా తన వంతుగా తక్షణమే మరమత్తులు చెప్పించి చుట్టూ పక్కల ఉన్న అల్వాల్ పాడ్, కొత్తపాలెం కాపులకుంట,కొత్తపాలెం తాండ,జాంపల్లి,దోర్నాల, ధరూర్ గ్రామ శివారు రైతులుకు నీరు సులభంగా వెళ్లడానికి మార్గం సుగుమం చేశారు, ఇంత చక్కటి తోడ్పాటును అందించిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవేంద్ర రెడ్డి ని పలువురు గ్రామ రైతులు చరవణిలో కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరోగ్యమే లక్ష్యంగా యోగాతో ముందడుగు

## డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, .. జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10 (ప్రభాత ఉదయం):**

99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద అయిదో రోజు హోమియోపతి, ఆయుష్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా యోగా శిక్షకులు అందరితో యోగా సాధన చేయించారు.

యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో యోగా సాధనను అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఆయుష్ విధానాలు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడతాయని చెప్పారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడానికి ఈ తరహా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని డీఎంహెచ్ఓ తెలిపారు.



యోగా ద్వారా శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా పొందవచ్చన్నారు. యోగా సాధనలో ఆసనాలు (శరీర భంగిమలు), ప్రాణాయామం (శ్వాస వ్యాయామాలు), ధ్యానం (మెడిటేషన్) వంటి అంశాలు ఉంటాయని, నిత్యం యోగా చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఒత్తిడి తగ్గుతుందని, నిద్ర మెరుగుపడుతుందని, అలాగే మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను నియంత్రించడంలో కూడా యోగా ఉపయోగపడుతుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ వివరించారు.

ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం కేటాయించి యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని స్పష్టం చేశారు.

ఈ యోగా కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఆయుష్ వైద్యాధికారులు, ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608